
ప్రజాశక్తి
గురువారం 21 సెప్టెంబర్ 2023
5
పార్వతీపురం మన్యం



## 26న జాబ్ మేళా

**ప్రజాశక్తి - సీతంపేట**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా పాలకొండ తమ్మినాయుడు డిగ్రీ కాలేజీలో ఈనెల 26 మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వైటిసి మేనేజర్ వెంకటరమణ తెలిపారు. ఎమ్మెల్సీ పి.విక్రాంత్ హాజరు కానున్నట్లు తెలిపారు. బుధవారం ఆయన జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ మేళాకు 11 కంపెనీ ప్రతినిధులు హాజరవుతారన్నారు. పదో తరగతి , ఇంటర్ , ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, బి.టెక్, ఎంబీఏ చదివిన అభ్యర్థులు అర్హులు అని తెలిపారు. వివరాలు www.apssdc.in వెబ్ సైట్ నమోదు చేసుకోవాలని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయికుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 917993795796, 9163051 10947, 63034 93720 నంబర్లను సంప్రదించాలన్నారు.

### తెలుగోడి సత్తా చాటుదాం..

# స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం
- విశాఖ ఉక్కు రక్షణ యాత్రకు ఘన స్వాగతం



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**

తెలుగు ప్రజల సత్తా చాటి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం కాకుండా కాపాడుకుందామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో ప్రారంభమైన విశాఖ ఉక్కు రక్షణ బైక్ యాత్ర బుధవారం సాయంత్రం విజయనగరానికి చేరుకుంది. స్థానిక వై-జంక్షన్ వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆధ్వర్యాన యాత్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వై-జంక్షన్ నుంచి మయూరి జంక్షన్, రైల్వేస్టేషన్ రోడ్డు, ఎన్‌సిఎస్, కన్యకాపరమేశ్వరి ఆలయం, గంట స్తంభం, మూడు లాంతర్లు, కోట జంక్షన్ మీదుగా బాలాజీ కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలాజీ జంక్షన్ సమీపంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంతోపాటు ఉత్తరాంధ్ర అభివృద్ధిలో విశాఖ స్టీల్‌ప్లాంట్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఉత్తరాంధ్రలో అత్యధికంగా ఉన్న గిరిజనులకు రిజర్వేషన్ల ద్వారా ఇక్కడ ఉపాధి లభిస్తోందని తెలిపారు. దీన్ని ప్రయివేట్ పరం చేయడమంటే దళితులు, గిరిజనులు, బిసిలు ఉపాధి కోల్పోతారని, సామాజిక న్యాయం హరించుకుపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. నేటికీ ప్లాంట్లో ఉపాధి కోసం ఎదురు చూస్తున్న 8500 మంది నిర్వాసితుల ఆశలు అడియాశలు అవుతాయని వాపోయారు. ప్లాంట్ పూర్తి స్థాయిలో నడిస్తే మరో పాతిక వేల మందికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. స్టీల్‌ప్లాంటును కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రయివేటీకరిస్తే ఉత్తరాంధ్ర మరింత వెనుకబాటులోకి నెట్టబడుతుందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన కేంద్ర నిర్ణయానికి వంతపాడటం సిగ్గుచేటని విమర్శించారు. ఈ పార్టీలు కేంద్రంలోని బిజెపి విధానాలను బలపరిచేవిగా ఉన్నాయని ఆక్షేపించారు. ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంటును కాపాడుకోవడం కేవలం తెలుగు ప్రజల చైతన్యంపైనే నేడు ఆధారపడి ఉందన్నారు. తెలుగు ప్రజల పౌరుషాన్ని చూపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

అనంతరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రానికి, ఉత్తరాంధ్రకు ఎంతో ద్రోహం చేస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని మాత్రం పల్లెత్తు మాట అనడానికి కూడా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు సాహసించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాన్ని రాష్ట్రంలోని ప్రధాన మూడు రాజకీయ పార్టీలు ఎదుర్కోలేవని, బిజెపికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహకరిస్తున్నాయని తేటతెల్లమైందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకంగా ఉన్న స్టీల్‌ప్లాంట్‌ని అమ్మేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. 29న విశాఖలో జరిగే బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రూపొందించిన గీతాలకు ప్రజా నాట్య మండలి కళాకారులు నృత్య ప్రదర్శన చేసి అలరించారు. సభలో సిపిఎం పాడేరు, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల నాయకులు సత్యనారాయణ, జగన్, తిరుపతిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.వి.రమణ, నాయకులు జగన్, పి.రమణమ్మ, పి.రామోమ్మహన్, స్లీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు రామారావు, సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్, తదితరులు పాల్గొన్నారు.



బైక్‌యాత్రకు స్వాగతం పలుకుతున్న తమ్మినేని సూర్యనారాయణ, రవణమ్మ

## ఎక్కువసార్లు వచ్చే అర్జీలను పక్కాగా పరిశీలించాలి

**ప్రజాశక్తి - పార్వతీపురం**

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎక్కువసార్లు వస్తున్న ఆర్జీలను పక్కాగా పరిశీలించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వస్తున్న ఆర్జీలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వస్తున్న ఆర్జీలను పక్కాగా పరిష్కరించాలన్నారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కావాలని అర్జీలను సమర్పించడం జరుగుతోందని, వాటి పట్ల సానుకూలంగా స్పందించాలని ఆయన చెప్పారు. ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై అధిక ప్రాధాన్యత ఇస్తున్న సంగతి విధితమేనని, దీన్ని దృష్టిలో పెట్టుకొని సంతృప్తికర పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి మల్లికార్జున, గృహ నిర్మాణ సంస్థ ఇన్ ఛార్జ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.రమేష్, డిపిఒ బలివాడ సత్యనారాయణ, ఐసిడిఎస్ పీడీ కె.విజయగౌరి, పోలీస్, ఎస్ఇబి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ

**ప్రజాశక్తి - పార్వతీపురం**

ముసాయిదా ఓటరు జాబితాను ఈనెల 17న ప్రచురణ జరుగుతుందని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు పునశ్చరణ కార్యక్రమంపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాను అక్టోబరు 17న ప్రచురణ జరుగుతుందని, క్లైమ్ లు, అభ్యంతరాలను అక్టోబరు 17 నుంచి నవంబరు 30 వరకు సమర్పించవచ్చని ఆయన వివరించారు. డిసెంబరు 26నాటికి వీటిని పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. అక్టోబరు 17 నుండి నవంబరు 30వ తేదీ వరకు రెండు శని వారాలు, రెండు ఆదివారాలు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడతామని తెలిపారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి అన్ని అంశాలు సరి చూసి జనవరి 5నాటికి తుది ఓటరు జాబితాను ప్రచురించడం జరుగుతుందని ఆయన తెలిపారు. 1500 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను ఈ నెల 29 వరకు జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ నెల 23 నాటికి ప్రతిపాదనలు సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో ఏప్రిల్ 15 నుండి సెప్టెంబరు 20 వరకు 18088 ఓట్లు చేర్చడం, 20236 ఓట్లు తొలగించడం జరిగిందని, 63965 ఓటర్ల వివరాల్లో మార్పులు చేర్పులు చేయడం జరిగిందని ఆయన వివరించారు. మొదటి స్థాయి ఇవిఎంలు, వివిపాట్ల పరిశీలన అక్టోబరు 4 నుంచి ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు. అక్సెప్టెన్స్ టెస్ట్‌ను గురువారం బిఇఎల్ ఇంజనీర్లు నిర్వహిస్తారని, రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు. సిపిఎం ప్రతినిధి పి.రాజశేఖర్ మాట్లాడుతూ కురుపాం మండలం బొత్తిలిలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో డిఆర్ఒ జె.వెంకట్రావు, హెచ్.సెక్షన్ సూపరెంటెంట్ డి.రవికుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యార్థులు లేరని గదబవలసలో మూతపడ్డ పాఠశాల

## కమిషన్ సభ్యులకు సమస్యల స్వాగతం

- రోడ్డు సౌకర్యాల్లేక గిరి పుత్రుల అవస్థలు
- ప్రకటనకే పరిమితం అవుతున్న పాలకులు
- ఇదీ మండలంలోని గిరిజన గ్రామాల దుస్థితి

**ప్రజాశక్తి - వీరఘట్టం**

జిల్లాలో ఈనెల 21న పర్యటించనున్న జాతీయ ఎస్‌టి కమిషన్‌కు గిరి తండాలు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు పైబడినప్పటికీ గిరిజన తండాలు అభివృద్ధి నోచుకోలేదంటే పాలకుల పనితీరు ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మండలంలోని గంగంపేట, మూలలంక, గాదిలంక, చిన్న గోరకాలనీ, పెద్దూరు, సింధు నగరం, బల్ల గుడ్డ, నీలంపేట, రామాపురం ,దువ్వనపాడు, గదభవలస, ఎలీషాపురం, రాయిమానుగూడ, బట్టిగూడ, కాగితాడ, శంగరాయపురం గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక సౌకర్యాల్లేవు. అవస్థల మధ్యే జీవనం సాగిస్తున్నారు. ఈ గ్రామాల్లో చిన్నారులకు విద్య, వైద్యం అందని ద్రాక్షలా మారింది.

**అధ్వాన రహదారులతో అవస్థలు**

కాగితాడ, రామపురం,బట్టగూడ ,కె. ఇచ్ఛాపురం, బల్ల గుడ్డ, గదభవలస తదితర గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. దీంతో గిరి పుత్రులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారులు అధ్వానంగా ఉండడం వల్ల గ్రామాలకు 104, 108 వాహనాలు రావడంలేదు. దీంతో వ్యాధుల బారిన పడిన రోగులు సంచు వైద్యులపై ఆధారపడి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా గర్భిణీలు తీవ్ర అవస్థలకు గురవుతున్నట్లు గిరి పుత్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పాఠశాల లేక ఇబ్బందులు**

మండలంలోని గదభవలస, వంకాయల గూడ, సింధునగర్, శృంగరాయపురం, తదితర గ్రామాల్లో పాఠశాల భవనాలున్నప్పటికీ విద్యార్థుల్లేరని ప్రభుత్వాలు మూసివేశాయి. గదబవలసలో 25 మంది విద్యార్థులున్నప్పటికీ ఇక్కడ పాఠశాల మూసివేయడంతో విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరానున్న కత్తులకవిటికి వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బల్ల గుడ్డ నుంచి ఇచ్ఛాపురం పాఠశాలకు, నీలంపేట నుంచి హుస్సేన్‌పురం పాఠశాలకు, శృంగరాయపురం నుండి బొడ్లపాడు పాఠశాలకు, వంకాయలగెడ్డ నుండి ఎం.రాజపురం పాఠశాలకు విద్యార్థులు కిలోమీటర్లు దాటి పాఠశాలకు వెళ్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. వర్షాల వల్ల ఈ రహదారులు అధ్వానంగా ఉండడంతో పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు గిరితండాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గిరి పుత్రులు కోరుతున్నారు.

## అన్నివేళలా అందుబాటులో ఎస్‌టి కమిషన్ : చైర్మన్

**ప్రజాశక్తి - బెలగాం**

గిరిజనుల అభివృద్ధి పట్ల రాష్ట్ర తెగలు (ఎస్టీ) కమిషన్ ఎల్ల వేళలా అందుబాటులో ఉంటుందని కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకర రావుకు అన్నారు. ఎస్‌టి రాష్ట్ర కమిషన్ జిల్లాలో మొట్ట మొదటి సారిగా బుధవారం పర్యటించింది. ఈ మేరకు స్థానిక ఐటిడిఎ గిరి మిత్ర సమావేశ మందిరంలో గిరిజన సంఘాల నుంచి సమస్యల పట్ల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఎస్టీ కమిషన్ ఎల్ల వేళలా అందుబాటులో ఉంటుందని, ఎప్పుడైనా గిరిజనులు తమ సమస్యలు తెలియజేయవచ్చున్నారు. సమస్యల పరిష్కారానికి కమిషన్ పరిధిలో అన్ని చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం దృష్టికి అవసరం మేరకు తీసుకువెళ్తామని ఆయన చెప్పారు.

పీసా చట్టం, 1/70 చట్టం, బినామీ గిరిజనులపై చర్యలు, షెడ్యూల్ ప్రాంతం చట్టాలు అమలులో నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల నాయకులు కె. ధర్మా రావు, నీలకంఠం కోరారు. బోయ వాల్మీకిని ఎస్టీ జాబితాలో చేర్చరాదని వారు కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు జరగకుండా నివారించాలని, ఆహార పదార్థాలు మెనూ ప్రకారం విధిగా అందించాలని, అవసరం మేరకు వర్కర్ల నియామకం, సౌకర్యాలు కల్పించాలని గిరిజన సంఘం నాయకులు భగవాన్ కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న బాలికలు గర్భం దాల్చిన సంఘటనలు జరిగాయని, వాటి నివారణకు పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో ఇష్టానుసారం డేప్యూటేషన్ వేస్తున్నారని వాటి పట్ల దష్టి సారించాలని ఆయన అన్నారు. గిరిజన సంఘం నాయకులు మండంగి రమణ మాట్లాడుతూ జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలని, ఏనుగుల వల్ల కలుగుతున్న ప్రాణ, ఆస్తి నష్టం దృష్ట్యా ఏనుగులను తరలించాలని, అటవీ హక్కుల చట్టంలో గిరిజనులకు నష్టం చేసే సవరణలు అపాలని, అటవీ ఫలసాయాలకు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, జిసిసికి నిధులు పెంచాలని, గిరిజన గ్రామాలను షెడ్యూల్ 5లో చేర్చాలని, పుర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని, అన్ని గిరిజన గ్రామాలకు అనుసంధాన రహదార్లు నిర్మించాలని, వైద్య సదుపాయాలు పెంచాలని కోరారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌టి కమిషనర్ చైర్మన్ శంకరరావు

ఉత్తరాంధ్ర గిరిజన సంఘం నాయకులు బి.రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఐటిడిఎ పిఒ నేతృత్వంలో గిరిజనులకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించాలని, ఐటిడిఎ పాలక మండలి సమావేశం నిర్దేశిత సమయంలో విధిగా నిర్వహించాలని, ఐటిడిఎ నిధులు గిరిజనుల అవసరాలకు మాత్రమే వినియోగించాలని కోరారు. నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని, పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వాలని కోరారు. మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్లు లేవని, ఈరోజుకు "డోలీ మోతలు"తప్పడం లేదని, గిరిజన ప్రాంతాల్లో ఎటువంటి పరిశ్రమ లేదని, జిల్లాలో క్రీడా పాఠశాలలు లేవని, జిల్లా లో బిఎస్సీ నర్సింగ్, జీఎన్ఎమ్ కళాశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలలు, పీజీ సెంటర్, జిల్లా కో "స్టడీ సర్కిల్" ఏర్పాటు చేయాలని కోరారు. ఐటిడిఎ పరిధిలో ఉన్న వసతి గృహాల వార్డెన్లు, సిబ్బందికి గత విద్యా సంవత్సరం సుమారు 10 నెలలు నుంచి బిల్లులు చెల్లించలేదని, వసతి గృహాల విద్యార్థులు ఇబ్బందులకు, సిబ్బంది ఒత్తిడికి గురౌతున్నారని, కావున ప్రభుత్వం డైట్ బిల్లులు చెల్లించాలని, గిరిజన విద్యార్థి సంఘం కమిటీ తరుపున పి. సురేష్, కమిటీ సభ్యులు వినతి పత్రం సమర్పించారు. కొమరాడ మండలం సివిని గ్రామానికి చెందిన ఎజ్జు బెల్లమ్మ కి సర్వేనెం 84/3 లో ఎం-36 సెంట్లు 'డి' పట్టా ఇవ్వడం జరిగిందని, సదరు 'డి' పట్టా భూమిలో సుమారు ఎం.12 సెంట్లు భూమిని శానపతి సన్యాసిరావు అనే భూస్వామి ఆక్రమించారని, దురాక్రమణ చేసిన సన్యాసిరావుపై చర్యలు తీసుకోవాలని వినతిని అందజేశారు. మక్కువ మండలం తెలగడవలసకు చెందిన విశ్వాణి స్వచ్ఛంద సంస్థ అందజేసిన ట్యాంకు ద్వారా తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. రామభద్రపురం మండలం జోగింద్ర వలసలో సామాజిక భవనాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పార్వతీపురం ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, ఎపిఒ ఎ.మురళీధర్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి కె శ్రీనివాసరావు, జిసిసి డిఎం వి. మహేంద్ర కుమార్, గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌కు ఘన స్వాగతం**

ఎస్‌టి కమిషనర్ ఛైర్మన్ డాక్టర్ డి వి జి శంకర రావుకు కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకట రావు, ఆర్‌డిఒ కె.హేమలత, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి కె శ్రీనివాసరావు పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వివరించారు. అనంతరం పలువురు గిరిజన సంఘాల నాయకులు సన్మానించారు.

## తహశీల్దార్ సరెండర్

**ప్రజాశక్తి - కొమరాడ**

విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన స్థానిక తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణను సరెండర్ చేస్తూ కలెక్టర్ నిశాంత్ కుమార్ బుధవారం ఆదేశాల జారీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగననన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించిన కలెక్టర్ మండల ప్రజలు వివిధ అంశాలపై ఫిర్యాదులు చేశారు. మండలంలో అత్యధికంగా రెవెన్యూ సమస్యలతో ప్రజల శతమాతమవుతున్నార విషయాన్ని కలెక్టర్ గమనించారు. మరోవైపు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం వినతుల పరిష్కారంలో తహశీల్దారు నిర్లక్ష్యం ప్రదర్శించారని స్పష్టం కావడంతో చర్యలకు ఆదేశించారు. ఆర్జీలు పరిష్కరించడంతో పాటు ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని కలెక్టర్‌కు నేరుగా ఆర్జీదారులు ఫిర్యాదు చేశారు. మరోవైపు గత ఆరు నెలల నుంచి కంప్యూటర్ ఆపరేటర్లు లేకపోవడంతో ప్రజలు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తహశీల్దారు పనితీరు సక్రమంగా లేదని ఏకంగా మాజీ ప్రజాప్రతినిధులు సైతం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తహశీల్దార్‌ను సరెండర్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## ఉపాధ్యాయుడు అనుమానాస్పద మృతి



మృతి చెందిన లక్ష్మమయ్య

**పాలకొండ** : స్థానిక ఇందిరానగర్ కాలనీలో దారుణం చోటు చేసుకుంది. సారవకోట మండ లానికి చెందిన అన్నుపురం లక్ష్మమ య్య (58) అనుమాదస్పదంగా మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే లక్ష్మమయ్య సీతంపేట మండలం బుడగరాయి లోని పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. లక్ష్మమయ్య భార్య నాలుగేళ్ల క్రితం సీతంపేటలో అనుమానస్పదంగా మృతి చెందింది. ఈ రోజు ఉపాధ్యాయుడు నివాసం ఉంటున్న ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇంటి యజమాని పోలీసులకు ఉదయం 10 గంటల సమయంలో మృతి చెందినట్లు తెల్పారు. ఉపాధ్యాయుడి మృతి పట్ల పోలీసులు అనుమానస్పద కేసు నమోదు చేసి మృతదేహంను పాలకొండ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళీధర్, ఎస్ఐ శివ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా ఆర్‌బికెలు

**ప్రజాశక్తి - పార్వతీపురం**

జిల్లాలోని ప్రతి రైతు భరోసా కేంద్రాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రంగా గుర్తించి, ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తుందని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్ 2023 - 24 సీజన్‌కు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతున్న తరుణంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైతు కళ్లాం నుంచి లేదా ప్రభుత్వం నిర్దేశించిన ప్రదేశం నుంచి యాదృచ్ఛికంగా ఎంపిక చేయసిన మిల్లుకు వెంటనే తరలించడం జరుగుతుందని చెప్పారు. ధాన్యం రవాణాలో పాల్గొనేందుకు ఆసక్తి గల వాహన యజమానులు ఈ నెల 22 కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని కోరారు. వాహన యజమానులు తమ వాహన వివరాలను జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయం వారికి సమర్పించి, వాహన వివరాలను అక్టోబరు 15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

## బైక్‌ర్యాలీ జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం

**ప్రజాశక్తి - బెలగాం**

విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు సిపిఎం తలపెట్టిన ఉత్తరాంధ్ర బైక్ యాత్ర జిల్లాలో ఈనెల 23, 24తేదీల్లో పర్యటించనుందని, ఈ సందర్భంగా జరిగే సభల్లో ప్రజలంతా పాల్గొనాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. ఈ మేరకు పట్టణంలోని వేదాంత, సాయిరాం, భాస్కర, ప్రభుత్వ జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజీల్లోనూ, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో కరపత్రాలు పంపిణీ, ప్రచారం చేపట్టారు. అనంతరం వేణు మాట్లాడుతూ ఉత్తరాంధ్రా అభివృద్ధికి, ఈ ప్రాంతం ఉపాధికి ఉపయోగపడే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి బిజెపి పెడితే కార్మిక ప్రజాసంఘాలు, వామపక్షాలు పోరాడుతున్నాయన్నారు. ఉక్కు పరిరక్షణ కోరుతూ 800 రోజులకు పైగా పోరాటం జరుగుతోందని, దీనికి మద్దతుగా ప్లాంట్ పరిరక్షణ కోసం 6 జిల్లాల్లో బైక్ యాత్ర సెప్టెంబరు 20-29 వరకు జరుగుతుందన్నారు. జిల్లాలో ఈనెల 23న 4గంటలకు పాలకొండ, 24న కురుపాంలో 9గంటలకు పార్వతీపురం, 12గంటలకు సాలూరులో 3గంటలకు బైకు యాత్ర జరుగుతుందని, ఈ సభలకు ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకటరమణ, పట్టణ నాయకులు బంకురు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.




కాలేజీలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

**సీతానగరం** : విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేయకుండా ఆపాలని కోరుతూ ఈనెల పార్వతీపురంలో బైక్ ర్యాలీ బహిరంగ సభ జరుగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. బుధవారం జరిగిన పార్టీ మండల సమావేశం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివద్ధి కోసం బైక్ ర్యాలీలు నిర్వహించి ప్రజలు మద్దతు కూడ గట్టాలన్నారు. ర్యాలీలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి లక్ష్మ నాయుడు మండల కమిటీ నాయకులు రెడ్డి ఈశ్వరరావు, జివి రమణ, తదితరులు పాల్గొన్నారు.

**బలిజిపేట** : స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సిపిఎం బైక్ యాత్ర పోస్టర్‌ను సిపిఎం నాయకులు వై.మన్మధరావు, గేదెల సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈనెల 23న సాయంత్రం ఐదు గంటలకు పాలకొండ, 24న కురుపాం, పార్వతీపురం, సాలూరులో ఉక్కు రక్షణ బైక్ యాత్ర రానుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నల్ల ఈశ్వరరావు, బాదిలి జగన్నాథం, రామారావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

**వీరఘట్టం** : ఈనెల 23న పాలకొండలో నిర్వహించనున్న ఉక్కు రక్షణ బైక్ యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.సింహాచలం, ఎన్.ప్రసాదరావు, వై.ప్రసాదరావుతో పాటు తదితరలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అజశర్మ

## పింఛను కోసం ఉధృత ఉద్యమాలు

### ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ

**ప్రజాశక్తి-రాజాం**

దేశవ్యాప్తంగా పింఛను కోసం ఉద్యోగులు ఉధృత ఉద్యమాలు సాగిస్తున్నారని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ తెలిపారు. బుధవారం స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద పీపుల్స్ ఫర్ ఇండియా ఆధ్వర్యాన చైర్మన్ ఎం.అప్పల నాయుడు అధ్యక్షతన 'ఎన్‌పిఎస్ రద్దు.. ఒపిఎస్ అందరికీ' అనే అంశంపై ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. దేశంలో 2004 నుంచి అమలు చేస్తున్న నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పిఎస్) వల్ల ఉద్యోగులకు పింఛను భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. పింఛను భిక్ష కాదని, ఉద్యోగుల హక్కని 1982 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు తీర్పిచ్చిందని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉద్యోగులు పాత పింఛను కోసం ఉద్యమాలు సాగిస్తున్నారని, పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని స్పష్టంచేశారు. దేశవ్యాప్తంగా పింఛను కోసం జాతా జరుగుతుందని, మన రాష్ట్రంలో ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీపుల్స్ ఫర్ ఇండియా కన్వీనర్ డివిఎస్ శ్రీనివాసరావు, పలు సంఘాల నాయకులు ఎం.మోహబ్, పక్కి వేణు, ఎన్.రామకష్ణ, ఎం.జితేంద్రరావు, రామ్మూర్తినాయుడు. వెంకటరమణ, పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


## నెడ్‌క్యాప్ డిఎంకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - బెలగాం

ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (నెడ్ క్యాప్) జిల్లా మేనేజర్ ఎ.వి.సుబ్రహ్మణ్యంకు ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతి ఇస్తూ రెండు జిల్లాల బాధ్యత యథావిధిగా నిర్వహించాలని ఆదేశించారు.



బగ్గందొరవలసలో పర్యటిస్తున్న టిట్కో చైర్మన్ ప్రసన్నకుమార్

## నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి- సీతానగరం

జగనన్న ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎపి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ అన్నారు. మండలంలోని బగ్గందరలవలస బుధవారం పేదల ఇళ్లనిర్మాణం, త్వరితగతిన పూర్తి, పలు రైతు సమస్యల పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న ఇళ్ల త్వరగా పూర్తి చేయాలన్నారు. చెరుకు రైతుల పట్ల, రైతు సమస్యల పట్ల ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తోందన్నారు. ఎవ్వరూ అధైర్య పడవద్దని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు నారాయణరావు, రామకృష్ణ, సింహాచలం, జగన్నాథం, ఎంపిటిసి శ్రీనివాస్, వెంకట నాయుడు, పెదబోగీల వైస్ సర్పంచ్ అరవింద్ కుమార్, నిడగల్లు మాజీ సర్పంచ్ గజాపు వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కె.గౌరీశ్వరరావు కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధాన కేంద్రాల్లోనూ విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించామన్నారు. రాష్ట్రప్రభుత్వం విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి, ఆర్థికంగా సహకారం అందించాలన్నారు. యువతకు శిక్షణ ఇచ్చి చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల నాయకులు, ఎం.భద్రయ్య, కోచర్ల సత్యన్నారాయణ, ఎం. కోదండ, చైతన్య, చిన్న, ఆచారి, నాగు, శ్రీను, సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



ఎంఇఒలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## ఎంఇఒలకు సన్మానం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర) ఆవరణలో బుధవారం మండల విద్యాశాఖ అధికారులు డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావుకు జెఎసి ప్రతినిధులు, ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛ అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎం.పైడ్రాజు, కె.విజయ్ కుమార్, వి.అన్నాజీరావు తదితరఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 22న గురజాడ కవితా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఈనెల 22న 10 గంటలకు వేదాంత జూనియర్ కళాశాల ఆవరణలో జరిగే కార్యక్రమంలో ఈ తరం కోసం కవితా స్రవంతి గురజాడ కవితా సంపుటిని ప్రముఖ కవి గంటేడ గౌరీ నాయుడు చేతుల మీదుగా ఆవిష్కరణ చేస్తున్నట్లు జిల్లా అరసం కార్యదర్శి పాలకొల్లు రామలింగస్వామి తెలిపారు. పార్వతీపురానికి చెందిన సాహితీ అభిమానులు, కవులు, కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు.



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న సిడిపిఒ అనంతలక్ష్మి

## కోస్టువలసలో పౌష్టికాహార వారోత్సవాలు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కోస్టువలస అంగన్వాడీ కేంద్రం వద్ద సెక్టార్ లీడర్ బంగారమ్మ ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిడిపిఒ బి.అనంతలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణీలు ప్రతిరోజూ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల రక్తహీనత లోపాన్ని అరికట్టవచ్చునని ఆమె సూచించారు. అలాగే పౌష్టికాహారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పౌష్టికాహార ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ సీతారాం, సిడిపిఒ చేతుల మీదుగా గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు

## సూర్యపీఠంలో నాగసిద్ధ గణపతి యాగ పూర్ణాహుతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో పట్టణ శివారులో ఉన్న శ్రీ సూర్య పీఠంలో బుధవారం బ్రహ్మశ్రీ అశేష శేముషి నిధి వేమకోటి నరహరి శాస్త్రి ఆధ్వర్యంలో శ్రీ సూర్య పీఠమునందు వేంచేసియున్న శ్రీలక్ష్మి గణపతి స్వామి ప్రీతికరంగా నవవిధ గణపతి ఆరాధనలు చేసి, యజ్ఞశాలలో పార్వతి పరమేశ్వరుల సమేతంగా శ్రీ నాగసిద్ధ గణపతిని ప్రతిష్టించారు. ముందుగా విఘ్నేశ్వర పూజ పుణ్యాహవాచనం పరిషత్ ప్రాయశ్చిత్తం రక్షాసూత్ర ధారణ పంచగవ్య ప్రాశన అఖండ దీప స్థాపన, యోగిని క్షేత్రపాలక వాస్తు నవగ్రహ మండపాలు ఆవాహన చేశారు. మూడు రోజుల యాగంలో ప్రత్యేక హెూమాలు, నవనాగార్చన, సర్పసూక్త, గణేషసూక్త, గణపతి అథర్వశీర్ష, రుద్రమంత్ర, విశ్వశాంతి మంత్ర పారాయణలు, హెూమాలు, అభిషేకాలు, లక్ష పత్రి పూజ పూర్ణాహుతి హెూమం నిర్వహించారు. కార్యక్రమంలో వేమకోటి వివేకానందశర్మ, రామకృష్ణశర్మ పాల్గొన్నారు.



యాగాలు చేస్తున్న నరహరిశాస్త్రి

# 'జగనన్నకు చెబుదాం'కు 60 ఫిర్యాదులు

ప్రజాశక్తి - కొమరాడ

జిల్లా కలెక్టర్ స్థాయిలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం మండలంలో బుధవారం జరిగింది. జిల్లా అధికారులంతా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మండల ప్రజలు వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వర్షాన్ని సైతం లెక్కజేయకుండా వినతులు సమర్పించారు. కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఆర్‌డిఒ కె.హేమలత ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 60 అర్జీలు అందాయి.

**త్వరితగతిన పరిష్కారమే ధ్యేయం**

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమర్పించిన అర్జీలకు త్వరితగిన పరిష్కారమే ధ్యేయమనికలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మండల స్థాయి సమస్యలు మండలంలోనే పరిష్కారం కావాలని ప్రభుత్వ ధ్యేయమని ఆయన వివరించారు. మండలంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 57 అర్జీలు అందాయని ఆయన అన్నారు. వీటిలో కొన్ని ఫిర్యాదులు...

మండలంలోని కంబవలసలో శ్మశాన వాటికకు వెళ్లి రావడానికి జంఝావతి కాలువ మీదగా రోడ్డు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ అంబటి వెంకటలక్ష్మి, గ్రామస్తులు వినతిని అందజేశారు. కొమరాడ గ్రామంలో ఉపాధి హామీ చట్టం ద్వారా అమలవుతున్న పనుల్లో వేతనాల్లో అవకతవకలు జరుగుతున్నాయని, ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఒడ్డి తిరుపతిరావు దరఖాస్తు అందజేశారు. మండలంలోని 31 పంచాయతీల్లో 9 పంచాయతీలకు అవసరమైన పూర్లపాడు-లాబేసు వంతెన పనులు పూర్తి చేయకపోవడంతో 9 పంచాయతీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే వంతెన నిర్మాణం పూర్తి చేయాలని సిపిఎం నాయకులు వి.ఇందిర, కె.సాంబమూర్తి, గిరిజనులు కోరారు. గంగరేగువలసలో గల రసాయన పురుగుల మందు ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేసి రైతులను కాపాడాలని కోరుతూ ఎంపిటిసి సభ్యులు ఎం.వెంకటనాయుడు వినతిని అందజేశారు. మండలంలోని సీసాడవలసలో సిసి రోడ్డు, కాలువల్లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కొండ నుంచి వచ్చే ఊట నీరుకు రక్షణ గోడ నిర్మించాలని సిపిఎం ప్రతినిధి కొల్లి.సాంబమూర్తి అర్జీ అందజేశారు. కొమరాడ మీదుగా కూనేరు నుండి 3 రాష్ట్రాలకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి మార్గాన ఉన్న గోతులను పూర్తిస్థాయి మరమ్మత్తు పనులు చేపట్టాలని, జీడిపంట వేసిన గిరిజన రైతులకు అన్ని విధాలుగా ఆదుకునేందుకు మన్యం జిల్లాలో ఒక జీడి ఫ్యాక్టరీని వెంటనే ప్రారంభించాలని, కొమరాడలో ఒక అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కొల్లి.సాంబమూర్తి కోరారు. గుణవతీలేసుకు చెందిన ఎం.శ్రీను ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. చినఖేర్జలకు చెందిన కె.ఉదయ్‌కుమార్ తన భూమిని వేరే వాళ్లు ఆక్రమించారని, వారిని తొలగించి తన భూమిని తనకు ఇప్పించాలని అర్జీ అందజేశారు. మాదలంగికి చెందిన శిష్టు వెంకట నాయుడు తన భూమిని వేరే వాళ్లు ఆక్రమణ చేసి ఉన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

# అక్రమ కేసులు పెట్టడం ప్రభుత్వానికి అలవాటు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రభుత్వంలోని లోపాలని, పాలకుల అసమర్థతను, నిరంకుశత్వాన్ని ప్రశ్నించిన ప్రతిపక్షాలను, ప్రజాసంఘాల నాయకులపై అక్రమ కేసులుపెట్టి అరెస్టులు చేయించడం ముఖ్యమంత్రి అలవాటుగా మార్చుకున్నారని టిడిపి పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర అన్నారు. చంద్రబాబు అరెస్టుపై నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం వెంకంపేట ఘోరీల కూడలిలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుతో కలిసి రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, బడే గౌరినాయుడు, టి.వెంకటరావు, కోలా సరిత మధుసూదనరావు, నాయకులు బార్నాల సీతారామారావు, బోను చంద్రమౌళి, గురజాన చంద్రమౌళి, జాగాన రవికుమార్, బేతలక్ష్మణరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కురుపాం :** మాజీముఖ్యమంత్రి చంద్రబాబును కుట్రపూరితంగా అరెస్టు చేయించి సంబరాలు చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి కచ్చితంగా ప్రజలు బుద్ధి చెబుతారని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద తెలుగు రైతు విభాగం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం పోస్టుకార్డుల ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అరుకు పార్లమెంట్ తెలుగు రైతు విభాగం అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత కుమార్, తవిటినాయుడు, కృష్ణబాబు, బొంగు సురేష్, ఐదు మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్వతీపురంలో దీక్షల్లో పాల్గొన్న టిడిపి నాయకులు

**సీతంపేట :** పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో చంద్రబాబుకు తోడుగా మేము సైతం కార్యక్రమంలో భాగంగా రిలే నిరాహార దీక్షలు పార్టీ కార్యాలయం సమీపంలో నిర్వహించారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ సీతంపేటలో "బాబుకు తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం"అంటూ చేపడుతున్న రిలే నిరాహారదీక్షలో ఆయన పాల్గొన్నారు. ఆయనతో పాటు రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, బిసి సెల్ అధ్యక్షులు ఆర్.రంగనాధం, ఐటిడిఎ కో-ఆర్డినేటర్ హిమరక పవన్, మహాశక్తి ప్రచారకర్త తోయిక సంధ్యారాణి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి - పాలకొండ

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. బుధవారం మండలంలో నవగాం, పొట్లి, బడుమసీంగి, ఎం.సింగపురం రహదారి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలు తమ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలి అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైస్ ఎంపిపి కనపక సూర్యప్రకాష్ , రణస్థలం రాంబాబు తదితరులు ఉన్నారు.

## ఇంజినీరింగ్ పనులు వేగవంతం : పిఒ

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులను వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పాలకొండ రూరల్, అర్బన్ పరిధిలోని పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీరుకు సంబంధించిన పనులను ముందుగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. పురోగతిలో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం డోలమడవలస గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకొండ ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి ఎస్‌టి సెల్ అధ్యక్షుడికి నోటీసు

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు దారూ నాయక్‌కు రూరల్ ఎస్‌ఐ ప్రయోగ మూర్తి 41 ఎ(3) నోటీసు జారీ చేశారు. డిప్యూటీ సిఎం రాజన్నదొరపై టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు దారూ నాయక్ అవినీతి ఆరోపణలు చేసిన నేపథ్యంలో మండల వైసిపి గిరిజన నాయకులు, సర్పంచులు ఆయనపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 25న ఉదయం 10గంటలకు విచారణకు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా రాజన్నదొర పేషీలో అక్రమాలు జరుగుతున్నాయని గతంలో టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు దారూ నాయక్ ఆరోపించారు. ఈ ఆరోపణలను నియోజకవర్గంలోనిగిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులు, రాష్ట్ర స్థాయి గిరిజన సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. రాజన్నదొరపై చేసిన అవినీతి ఆరోపణలు నిరూపించాలని సవాల్ చేశారు. అంతటితో ఆగకుండా సాలూరు, పాచిపెంట పోలీస్ స్టేషన్ లలో వైసిపి నాయకులు దారూ నాయక్ పై ఫిర్యాదు చేశారు.

## రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

మండలంలోని నవగాం జంక్షన్ వద్ద నవగాం నుంచి జంపరకోట వరకు ఆర్ అండ్ బి రహదారికి రూ 3.50 కోట్లతో ప్రత్యేక మరమ్మతు పనులకు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శంకుస్థాపన బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు కణపాక సూర్య ప్రకాష్, వాకముడి అనిల్, నల్లి శివప్రసాద్, పొట్నూరు లక్ష్మణరావు, చిన్నారావు, గొర్లె కృష్ణ, బిడ్డిక వెంకయ్య, రణస్థలం రాంబాబు, అరిక వెంకటేష్, హైమావతి, శ్యామ్ సుందరరావు, పాలకొండ మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## మహిళా బిల్లు పట్ల హర్షం

ప్రజాశక్తి - సీతానగరం

పార్లమెంటులో మహిళా బిల్లు ప్రవేశ పెట్టడంతో మహిళలకు మేలు జరుగుతుందని రాష్ట్ర ఎస్‌సి కమిషనర్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ బిల్లుతో మహిళలకు సంక్షేమ పథకాలు, మహిళా చట్టాల అమల్లోనూ న్యాయం జరుగుతుందన్నారు. ఈ బిల్లు ప్రవేశ పెట్టడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు.

## మత్స్యకారులకు శిక్షణ

ప్రజాశక్తి- సాలూరు రూరల్

మండలంలోని అన్నమరాజు వలస గిరిజన మత్స్యకార సంఘ సభ్యులకు మూడు రోజుల పాటు మామిడిపల్లిలో రైతు భరోసా కేంద్రం వద్ద శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ ఫీల్డ్ మేనేజర్ ఐ రాము మాట్లాడుతూ మత్స్యకారులందరూ చేపలు, రొయ్యిలు పెంపకం విధానంలో, వేట విషయంలో గాని గతంలో మాదిరి మూస పద్ధతిలో కాకుండా మంచి యాజమాన్య పద్ధతులలో చేయాలని అప్పుడే మంచి ఆదాయం పొందుతారని, ప్రభుత్వం అందించే ప్రొత్సహకాలతో సంఘంలో వుండే ప్రతి ఒక్క సభ్యుడు లాభం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నంరాజువలస సర్పంచ్ చీమల రాములమ్మ, మామిడిపల్లి సర్పంచ్ సువ్వాడ శశికళ, మాజీ వైస్ ఎంపిపి సువ్వాడ రామకృష్ణ, గిరిజన మత్స్యకార సంఘం అధ్యక్షులు సురాపాటి ఆదినారాయణ, సభ్యులు పాల్గొన్నారు.



టీకాలపై అవగాహన కల్పిస్తున్న డిఐఒ జగన్మోహన్

## టీకా కార్యక్రమంలో మార్గదర్శకాలు పాటించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

సార్వత్రిక టీకా కార్యక్రమంలో నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన 13వ వార్డులో (బైపాస్ కాలనీ) వైద్య సిబ్బంది నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీకా కార్డులు, ఆర్సిహెచ్ రికార్డులు, టీకా పొందుతున్న చిన్నారుల, గర్భిణీలు వివరాలతో పాటు టీకా కేంద్రంలో ఉండాల్సిన అత్యవసర మందుల కిట్ హబ్ కట్టర్, ఉపయోగించిన సిరంజీలు, అలాగే వ్యాక్సిన్ వయల్స్ స్థితి తదితర వాటిని తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు. టీకా గడువు తేదీలను పరిశీలించి అక్కడ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి ముందస్తు సమాచారం సిబ్బంది ఇస్తున్నారా అని ఆరా తీశారు. వేస్తున్న ప్రతి టీకా ఆవశ్యకతను, అవి నిరోధించే వ్యాధులను తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్స్ పుష్ప ,సత్తిబాబు, ఎఎన్ఎమ్ సునీత, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జయమణి

## ప్రభుత్వ కళాశాలల్లో పర్యాటక యువ క్లబ్బులు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలో పర్యాటక యువ క్లబ్‌ను ఏర్పాటు చేశామని పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం డిగ్రీ, జూనియర్ కళాశాలలలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఏడో తరగతి నుండి యూనివర్సిటీ వరకు పర్యాటక క్లబ్బులు ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు. హై స్కూల్ నుండి డిగ్రీ, ఇంజనీరింగ్, నర్సింగ్ కాలేజీల్లో యువ క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ క్లబ్‌ల ద్వారా భారతీయ సంస్కృతి వారసత్వ సంపదను తెలియజేసేందుకు, జిల్లాలో పర్యాటక ప్రదేశాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు జయ మణి, డాక్టర్ ఉత్తరావిల్లి సత్యప్రభ పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, చుట్టూ పక్కల శుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.రమేష్, ఎ. విజయగౌరి, ఎ.సురేష్, ఎ.రమ్య, బి.లావణ్య, సింహాచలమమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గడపగడపకు నివేదికలు తయారు చేయండి

ప్రజాశక్తి - పాలకొండ

గడపగడపకు మన ప్రభుత్వంలో వచ్చిన సమస్యలపై నివేదికలు తయారు చేయాలని సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. బుధవారం స్థానిక ఐకెపి కార్యాలయంలో ఇంజనీరింగ్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో సమస్యల గుర్తించి నివేదికలు తయారు చేస్తే ప్రభుత్వాన్ని పంపించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా మౌలిక సదుపాయాల్లేని ప్రాంతాలు గుర్తించి నివేదికలు తయారుచేయాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఉమామహేశ్వరి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఢిల్లీశ్వరరావు తదితరులు ఉన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డిఎస్‌పి మురళీధర్

## వినాయక నిమజ్జనాల్లో అప్రమత్తంగా ఉండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన వినాయక మండపాలకు సంబంధించి నిమజ్జనం కార్యక్రమాల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని డిఎస్పీ మురళీధర్ చెప్పారు. మంగళవారం సాయంత్రం శివాలయం వీధిలో ఉన్న సీతారామ ధర్మశాలలో వినాయక నిమజ్జనాలపై సంబంధించిన కమిటీ సభ్యులు, పట్టణ పెద్దలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు, పెద్దలే చర్యలు తీసుకోవాలని కోరారు. ఊరేగింపుల్లో డిజె సౌండ్స్ వినియోగించరాదని సూచించారు. ఎప్పుడు,ఏ మార్గం గుండా నిమజ్జనం చేయనున్నారో కమిటీ సభ్యులు ముందుగా తెలియజేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు, ఎస్‌ఐ భాస్కరరావు పాల్గొన్నారు.

## అటవీ శాఖ సిబ్బందికి సహకరించండి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఒంటరి ఏనుగు హరి ఏనుగుల గుంపులో కలిసిందని, మొత్తం ఏనుగుల గుంపు రేంజ్ దుగ్గి ముంపు ప్రాంతం వద్ద ఉన్నాయని జిల్లా అటవీ అధికారి జిఎపి ప్రసూన తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా అటవీ అధికారి ఒక ప్రకటన విడుదల చేశారు. వినాయక చవితి పండుగ సందర్భంగా ఏనుగుల సంచారంపై అటవీశాఖ ఆయా ప్రాంతాల ప్రజలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తం చేసిందన్నారు. వినాయక చవితి సందర్భంగా మానవ - జంతు సంఘర్షణలు జరగకుండా ఏనుగుల జాడ ఎప్పటికప్పుడు గమనించేందుకు అటవీ సిబ్బంది సంఖ్యను పెంచడం, ప్రజలను అప్రమత్తం చేయడం జరిగిందని ఆమె వివరించారు. కొమరాడ మండలంలో ముఖ్యంగా పాతదుగ్గి, కళ్లికోట, సీమనాయుడు వలస, దలైపేట, బిత్రపాడు గ్రామాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. ఏనుగుల సంచారంపై సంబంధిత అటవీ అధికారుల నుండి ముందుగా సమాచారం పొందాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఎటువంటి దుస్సంఘటనలు జరగకుండా సహకరించాలని ఆమె కోరారు.

## ఇచ్చిన హామీని సిఎం నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని అగ్రిగోల్డ్ బాధిత సంఘ నాయకులు బుధవారం ఎమ్మెల్యే వి.కళావతి స్వగ్రామైన వండువలోని క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు బి అప్పలనాయుడు మాట్లాడుతూ 2017లో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ విజయవాడలో జరుగుతున్న ఆమరణ దీక్ష వద్దకు ప్రతిపక్ష హెూదాలో వచ్చి పార్టీ అధికారంలోకి వస్తే బాధితులకు రావాల్సిన డబ్బులు పైసాతో సహా చెల్లిస్తామని, మరణించిన కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇప్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆనాడు జరుగుతున్న దీక్షను విరమింపచేశారని అన్నారు. కనీసం ఇప్పటి వరకు రూ.30.80 కోట్లు రాష్ట్రంలో బాధితులకు రావాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ త్వరలో జరగబోయే శాసనసభ సమావేశంలో పైఅంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు, బంగారి, బి.శివకుమార్, బి.దుర్గారావు, సోమశేఖర్ తదితరులు ఉన్నారు.

## ముసురు పట్టిన మన్యం

ప్రజాశకి - గుమ్మలక్ష్మీపురం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మంగళవారం రాత్రి నుంచి ఏజెన్సీ ప్రాంతానికి ముసురు పట్టింది. దీంతో బుధవారం రోజంతా ఎడతెరపు లేకుండా వర్షం కురిసింది. ఒకవైపు మండే ఎండలతో ఎండిపోతున్న వరి పైరుకు ఈ వర్షం ఎంతో అనుకూలంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. కొండపోడు వ్యవసాయానికి కూడా వర్షం ఉపయోగకరంగా ఉంటుందని గిరిజనులు చెబుతున్నారు. కురిసిన వర్షంతో వ్యాపారులు, ఉద్యోగులు, ప్రయాణికులు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల రోడ్లపై నీరు చేరడంతో పాదచారులు ఇబ్బందులు పడ్డారు. కురుపాం, జియమ్మవలస మండలాల్లో తుఫాను వర్షం ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

## తక్షణ సాయం అందజేత

ప్రజాశక్తి - మక్కువ

ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన మార్కొండపుట్టి పంచాయితీ పెదఘాశిలకు చెందిన పెద్దపల్లి మోహన్ (49) భార్య గంగమ్మకు వైయస్సార్ బీమా పథకం తక్షణ సహాయం కింద బుధవారం రూ.10వేలు తక్షణ ఆర్థిక సహాయం పంచాయితీ వైసిపి కన్వీనర్ వెంపడాపు శ్రీనివాసరావు చేతుల మీదుగా మృతుని కుటుంబానికి అందజేశారు. ఆర్థిక సహాయం మొత్తం లక్ష రూపాయలు అందుతుందని, త్వరలో మిగతా సహాయాన్ని అందిస్తామని గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ తెలిపారు.

## సిఆర్‌పిఎఫ్ సిబ్బంది శ్రమదానం

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి మరియు బజార్ వీధులను మక్కువ 198 బెటాలియన్ సిఆర్పిఎఫ్ సిబ్బంది పరిశుభ్రం చేశారు బుధవారం ఉదయాన్నే చిన్నపాటి వర్షం పడుతున్నప్పటికీ వీధుల్లో పేరుకు పోయిన చెత్తను పరిశుభ్రం చేశారు సిబ్బంది చీపుర్లను పెట్టి పరిశుభ్రం చేయడంపై ప్రజలంతా హర్షాతిరేకలు వ్యక్తం చేశారు. సైనికులకు ఉన్న స్వచ్ఛ సంకల్పాన్ని చూసి ప్రజలు మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలంతా స్వచ్ఛతను పాటించాలని సిఆర్‌పిఎఫ్ సిబ్బంది పిలుపునిచ్చారు